'స్థానిక' ఎన్నికల్లో

ఒంటరిగానే పోటీ



- హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలం
- మన దేశంపై అమెరికా పెత్తనం సహించేది లేదు
- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం

8



ఖమ్మంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ర్యాలీని ప్రారంభిస్తున్న మంత్రి

1000 అడుగుల జాతీయ జెండాతో

నగరంలో భారీ ర్యాలీ

- ర్యాలీని ప్రారంభించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంఖానాపురంహవులి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పంద్రాగస్టును పురస్కరించుకొని ఖమ్మం నగరంలోని బైపాస్ రోడ్డు తారకరామా ఆటోనగర్‌లో గల ఫోర్ వీలర్స్ టెక్నీషియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 1000 అడుగుల జాతీయ జెండా ర్యాలీని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరిలో భారతీయత ఉట్టిపడేలా జాతీయ జెండాలతో ర్యాలీలో పాల్గొనాలన్నారు. ఆ తర్వాత కుల మతాలకు అతీతంగా కార్మికులు జాతీయ జెండాలను పట్టుకొని ఖమ్మం నగర పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. నగరంలోని బైపాస్ రోడ్డు కాలవొడ్డు నుంచి జడ్పీ సెంటర్, ఐటీ హబ్ సర్కిల్ మీదుగా ఇందిరానగర్ వరకు ర్యాలీ కొనసాగింది. భారత్‌మాతాకీ జై అంటూ ఖమ్మం పురవీధులు మార్మోగాయి. ఈ కార్యక్రమంలో తారకరామా ఆటోనగర్ అధ్యక్షులు మహంకాళి మల్లికార్జున్, రవి, జానీ పాషా, కిషోర్, శ్రీనివాసరావు, చామేందర్ రెడ్డి, సీతారాంరెడ్డి, కార్మికులు పాల్గొన్నారు.



సీఎం పర్యటించే ప్రదేశాన్ని ఎస్పీతో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జారె

21న సీఎం పర్యటన

- ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే, ఎస్పీ
- ఇళ్ల నిర్మాణంలో బెండాలపాడు రాష్ట్రానికే ఆదర్శంగా నిలవాలి : కలెక్టర్ జితేష్ వి పాటిల్

8

'సీతారామ'

నీటి విడుదలకు ఏడాది

- రూ.19,325కోట్లకు పెరిగిన వ్యయం
- వచ్చే ఏడాది ఆగస్టు 15నాటికి పనులు పూర్తి చేస్తామన్న సీఎం హామీ నెరవేరేనా !?



గతేడాది సీతారామ మూడు లిఫ్టులను ప్రారంభిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, పక్కన ఉత్తమ్, తుమ్మల, పొంగులేటి (ఫైల్)

ఖమ్మం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతుల ఆశాదీపం సీతారామ ఎత్తిపోతల పథకం నుంచి నీరు విడుదల చేసి నేటికి ఏడాది అవుతోంది. గతేడాది ఆగస్టు 15న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటరెడ్డి వెంకటరెడ్డి చేతుల మీదుగా మూడు లిఫ్టులను ప్రారంభించి ఏన్కూరు లింక్ కెనాల్ ద్వారా కృష్ణా ఆయకట్టులోని సాగర్ కెనాల్‌కు వదిలారు. తద్వారా గోదావరి జలాలను కృష్ణమ్మ ఒడికి పంపించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వైరాలో జరిగిన రైతు సభలో 2026, ఆగస్టు 15 నాటికి సీతారామకు సంబంధించి అన్ని పనులు పూర్తి చేసి ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ఆయకట్టుకు నీరందిస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం సీతారామ అంచనా వ్యయం పెరగడంతో ఇటీవల కేబినెట్‌లో కూడా ఆమోదించారు. రూ.13,057 కోట్ల వ్యయంతో గత ప్రభుత్వం చేపట్టిన ఈ పనులు పెరిగిన అంచనాతో ప్రస్తుతం రూ.19,325కోట్లకు చేరింది. బీఆర్ఎస్ ప్రభుత్వంలో అసంపూర్తిగా సీతారామ (మిగతా 8వ పేజీలో)



అశ్వారావుపేట మండలం వాగొడ్డుగూడెం వద్ద పొంగుతున్న వాగు

దంచికొట్టిన వాన

- ఉమ్మడి జిల్లాలో పలు చోట్ల భారీ వర్షం
- 62.6 మి.మీ. సగటు వర్షపాతం నమోదు
- పొంగుతున్న వాగులు, వంకలు
- విప్పలమడక వద్ద కూలిన లింగన్నపాలెం సాగర్ బ్రాంచి కెనాల్ లైనింగ్
- భద్రాద్రి జిల్లాలో రాష్ట్రంలోనే అత్యధికం

ఖమ్మం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతిప్రతినిధి)/కొత్తగూడెం: బంగాళఖాతంలో అల్పపీడనం ప్రభావంతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం తెల్లవారు జాము వరకు వర్షం దంచి కొట్టింది. మరికొన్ని ప్రాంతాల్లో ముసురు వర్షం కురిసింది. బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు జిల్లాలో 62.6 మి.మీ. సగటు వర్షపాతం నమోదైంది. జిల్లాలో అత్యధికంగా మధిరలో116.8 మి.మీ, పెనుబల్లి 110.4మి.మీ.,సత్తుపల్లి107.4మి.మీ., వేంసూరులో 101.2మి.మీ, ఎర్రుపాలెంలో 81.2మి.మీ, వర్షపాతం పడింది. మండలాల వారీగా పరిశీలిస్తే.. సింగరేణి 40.0మి.మీ., కామేపల్లి 42.4మి.మీ, రఘునాధపాలెం 44.6మి.మీ, ఖమ్మంరూరల్ 35.6మి.మీ, తిరుమలాయపాలెం 24.6మి.మీ.,కూసుమంచి 87.8మి.మీ., నేలకొండపల్లి 53.2మి.మీ., ముదిగొండ 70.6మి.మీ., చింతకాని 71.2మి.మీ, ఖమ్మం అర్బన్ 25.6మి.మీ, కొణిజర్ల 38.2మి.మీ, ఏన్కూరు 69.6మి.మీ, కల్లూరు 55.2మి.మీ, పెనుబల్లి 110.4మి.మీ, సత్తుపల్లి 107.4మి.మీ, వేంసూరు 101.2మి.మీ., తల్లాడ 30.2మి.మీ, వైరా 21.2మి.మీ., బోనకల్‌లో 78.4మి.మీ వర్షపాతం పడింది. వరుస వర్షాలతో జిల్లాలోని పాలేరు, వైరా ప్రాజెక్టులు నిండాయి. లంకసాగర్ 16అడుగులకు గాను 11.6 అడుగులకు చేరింది. చెరువుల్లో జల కళ కనిపిస్తోంది. మున్నేరు కూడా ఎగువన కురిసిన వర్షాలతో జలకళను సంతరించుకుంది. జిల్లాలో అనేక వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. జిల్లాలో వర్షాలు, వరదలపై మంత్రి తుమ్మల నాగేశ్వరావు అధికారులతో చర్చించారు. హైదరాబాద్ నుంచి రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లాలో ప్రస్తుతం అన్ని చెరువుల్లో జలకళ కనిపిస్తోంది. వర్షాల కారణంగా పంటలు కూడా కళకళలాడుతున్నాయి. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సీపీ సునీల్‌దత్, జిల్లా అధికారులను అప్రమత్తం చేశారు. నీటిపారుదల శాఖ ఎస్ఈ ఎం.వెంకటేశ్వర్లు చెరువులకు ఎక్కడైనా గండ్లు పడితే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోక్లెయినర్లు సిద్ధం చేశారు. జిల్లాలో వర్షాల కారణంగా తల్లాడ మండలంలోని మాచవరం వాగు పొంగి ప్రవహించడంతో.. రాకపోకలకు అంతరాయం కలిగింది. వైరా మండలం తాటిపుడి వద్ద మీరాబీ అనే మహిళ పూరిపాక ఇల్లు వర్షానికి కూలింది. వైరా మండలం విప్పలమడక వద్ద సాగర్ ఎడమకాలవ లింగన్నపాలెం బ్రాంచ్ కెనాల్ లైనింగ్ వంద మీటర్ల పొడవున నిర్మాణంలో ఉన్న లైనింగ్ పనులు వర్షానికి కూలిపోయాయి. సుమారు రూ.5లక్షల వరకు నష్టం జరిగింది. కూసుమంచి మండలం నర్సింహులగూడెం- కొత్తూరు, (మిగతా 8వ పేజీలో)

భారీ వర్షాల నేపథ్యంలో

అప్రమత్తంగా ఉండండి

- ఆస్తి, ప్రాణ నష్టం సంభవించకుండా చూడండి
- వరద సహాయక చర్యలకు జిల్లాకు రూ.కోటి
- వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులు తుమ్మల, పొంగులేటి
- పాల్గొన్న ఖమ్మం, భద్రాద్రి జిల్లాల కలెక్టర్లు

8



వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పొంగులేటి, సీఎస్ రామకృష్ణ, హాజరైన కలెక్టర్ జితేష్ వి పాటిల్

అగ్నిమాపక శాఖ లీడింగ్ ఫైర్‌మెన్ సాధిక్‌కు కేంద్ర ప్రభుత్వ అవార్డు



భద్రాచలం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) అగ్నిమాపక శాఖ భద్రాచలం కార్యాలయంలో లీడింగ్ ఫైర్‌మెన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఎండి సాధిక్‌కు స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కేం ద్ర హోం మంత్రిత్వ శాఖ అవార్డు ప్రకటించింది. విధి నిర్వహణలో ఆయన అంకిత భావ సేవలను గుర్తించిన కేంద్ర హోం మంత్రిత్వ శాఖ మెరిటోరియస్ సర్వీసెస్ అవార్డుకు ఆయనను ఎంపిక చేశారు. కాగా సాధిక్‌కు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ అవార్డు ప్రకటించటం పట్ల భద్రాచలం అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాస్, సహచర ఉద్యోగులు ఆయనను ప్రత్యేకంగా అభినందించారు.

'పెద్దపులి' కోసం

గాలింపు

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన అటవీ అధికారులు

8

రింగ్‌బండ్‌కు గండి..

- వృథాగా పోతున్న నీరు



గండిపడిన దృశ్యం

చంద్రుగొండ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వెంగళరావు ప్రాజెక్టు అలుగు వద్ద ఏర్పాటు చేసిన రింగ్ బండ్‌కు గండి పడి ప్రాజెక్టులోని నీరు అంతా వృథాగా పోతుంది. తక్షణం గండిని పూడ్చే పరిస్థితిలేదు. దాంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఐదేళ్ల క్రితం సంభవించిన భారీ వర్షాలకు ప్రాజెక్టు అలుగు పూర్తిగా ధ్వంసమైంది. అప్పటినుంచి అలుగు పునర్ నిర్మాణం చేపట్టలేదు. ప్రతి సీజన్‌లో తాత్కాలిక కట్ట నిర్మించి ఒక పంటకు సాగునీరు అందేవిధంగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కాగా గత మార్చిలో జాతీయ ఎస్టీ కమిషన్ జోక్యంతో ప్రభుత్వం నిధులు మంజూరు చేసి టెండర్లు పూర్తిచేశారు. అయితే ఈ ఖరీఫ్‌కు నీరు అందించేందుకు ఎప్పటిలాగానే రింగ్‌బండ్ (తాత్కాలిక కట్ట) ఏర్పాటు చేశారు. పటిష్టంగా నిర్మించకపోవటంతో కట్టకు గండి పడింది.



స్వాతంత్ర్య వేడుకలకు ముస్తాబైన ప్రగతి మైదానం

- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ జితేష్ వి పాటిల్
- జాతీయ జెండాను ఆవిష్కరించనున్న మంత్రి తుమ్మల

కొత్తగూడెం కలెక్టరేట్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): 79వ స్వాతంత్ర్య వేడుకలకు కొత్తగూడెంలోని ప్రగతి మైదానాన్ని రంగరంగ వైభవంగా తీర్చిదిద్దారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో స్టాళ్ల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గురువారం కలెక్టర్ జితేష్ వి పాటిల్ ప్రగతి మైదానాన్ని సందర్శించి అధికారులకు తగిన సూచనలిచ్చారు. వర్షాన్ని సైతం ఎదుర్కొనే విధంగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కళాశాలలు, స్వాతంత్ర్య సమరయోధులకు, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరై జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యాచందన. కొత్తగూడెం ఆర్డీవో మధు పాల్గొన్నారు.

ఇసుక దొంగలు!

- రేగుబల్లిలో మాయమవుతున్న ఇసుక నిల్వలు
- నిర్వహణను గాలికొదిలేసిన ఖనిజాభివృద్ధి శాఖ
- అటు వైపు కన్నెత్తి చూడని అధికారులు
- కలెక్టర్ దృష్టి సారిస్తేనే ఇందిరమ్మ ఇళ్లకు ప్రయోజనం



రేగుబల్లి వద్ద టీఎస్ఎండీసీ ఇసుక నిల్వ

దుమ్ముగూడెం ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఇసుక దొంగలు రెచ్చిపోతున్నారు. రాష్ట్ర ఖనిజాభివృద్ధి శాఖ ఆధీనంలో జెడ్. రేగుబల్లి వద్ద నిల్వ చేసిన భారీ ఇసుక నిల్వలను రాత్రికి రాత్రే మాయం చేస్తున్నారు. గత ఏడాది నందులచెలక సొసైటీ ఆధ్వర్యంలో రైజింగ్ కాంట్రాక్టర్ గోదావరి నది నుంచి ఇసుకను తరలించి రేగుబల్లి ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారి పక్కన పెద్ద ఎత్తున నిల్వ చేశాడు. ప్రస్తుతం సుమారు రూ.10 లక్షల విలువ గల మూడు వేల క్యూబిక్ మీటర్ల ఇసుక నిల్వ ఉన్నట్లు తెలుస్తోంది. అయితే తోలకం కాలపరిమితి ముగియడం.. మళ్లీ అనుమతి లభించకపోవడంతో ఇసుక రవాణా నిలిచిపోయింది. అలాగే ఇసుక నిల్వ కోసం రైజింగ్ కాంట్రాక్టర్ కొంత భూమిని స్థానిక రైతు నుంచి అద్దె ప్రాతిపదికన తీసుకున్నాడు. లీజ్ కాలపరిమితి ముగియడం, ఇసుక నిల్వలను తన స్థలం నుంచి తొలగించకపోవడంతో సదరు రైతు లబోదిబోమంటున్నాడు. తన భూమికి అద్దె ఎవరు చెల్లిస్తారని ప్రశ్నిస్తున్నాడు. కాగా మైనింగ్‌శాఖ ఆధీనంలో ఉన్న ఇసుక నిల్వల నుంచి రాత్రి వేళల్లో ట్రాక్టర్ల ద్వారా జోరుగా అక్రమ రవాణా జరుగుతోంది. కొద్ది రోజుల క్రితం ఒక లారీ ద్వారా ఇసుకను తరలించే ప్రయత్నం జరగ్గా.. గ్రామస్థులు అడ్డుకున్నారు. టీఎస్ఎండీసీ శాఖ అధికారులు ఇసుక నిల్వలను సీజ్ చేసి, ఇందిరమ్మ లబ్ధిదారులకు విక్రయిస్తే.. అటు ప్రభుత్వానికి ఆదాయంతో పాటు ఇటు లబ్ధిదారులకు ఎంతో ప్రయోజనకరం ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ దృష్టి సారించి.. వృథాగా పడి ఉన్న ఇసుక నిల్వలను ఇందిరమ్మ గృహ లబ్ధిదారులకు కేటాయిస్తే ఇళ్ల నిర్మాణ వేగం పెరిగే అవకాశం ఉంది.

ఇసుక నిల్వలను పట్టించుకోని టీఎస్ఎండీసీ!

నందులచెలక సొసైటీ ఆధ్వర్యంలో ఇసుక తోలకాలకు 2024, అక్టోబరు వరకు మాత్రమే టీఎస్ఎండీసీ అనుమతి ఉండడంతో ఇసుక రవాణా నిలిచి పోయింది. తోలకం గడువు ముగిసేనాటికి రేగుబల్లి వద్ద సుమారు మూడు వేల క్యూబిక్ మీటర్ల ఇసుక నిల్వ ఉంది. మరోమారు అనుమతి కోసం ప్రయత్నాలు చేయగా.. పునరుద్ధరణకు నోచుకోలేదు. దీంతో కాంట్రాక్టర్ ఇసుక నిల్వలను అలాగే వదిలేశాడు. కాగా.. రూ. 10లక్షల విలువగల ఇసుక నిల్వలు వృథాగా పడి ఉన్న విషయం టీఎస్ఎండీసీ అధికారులకు తెలిసినా.. నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి. తాజాగా కొందరు ట్రాక్టర్ల ద్వారా ఇసుక నిల్వలను అక్రమంగా తరలిస్తున్నా.. అధికారులెవరూ పట్టించుకునే పరిస్థితి లేదు.

ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇస్తే ప్రయోజనం

టీఎస్ఎండీసీ ఆధీనంలో ఉన్న రేగుబల్లి ఇసుక నిల్వలను మండలంలోని ఇందిరమ్మ లబ్ధిదారులకు పంపిణీ చేస్తే ఎంతో ప్రయోజనకరం చేకూరుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎండాకాలంలో మొదలు పెట్టాల్సిన ఇందిరమ్మ ఇళ్లను హౌజింగ్ అధికారుల అలసత్వం కారణంగా చాలా ఆలస్యంగా వర్షాకాలం వచ్చే ముందు ప్రారంభించారు. దీంతో లబ్ధిదారులకు గోదావరి నది నుంచి ఇసుక దొరికే అవకాశం కనుచూపు మేరలో కానరావడం లేదు. అవకాశాన్ని బట్టి కొందరు ట్రాక్టర్ల యజమానులు ట్రాక్టర్ ఇసుకను రూ.3వేల నుంచి రూ. 3,500 వరకు అడ్డగోలుగా విక్రయిస్తున్నారు. దీంతో అధిక ధరలకు ఇసుక కొనుగోలు చేసి.. తాము ఇళ్లను కట్టలేమని లబ్ధిదారులు లబోదిబో మంటున్నారు. ఇళ్లను సకాలంలో కట్టకపోతే క్యాన్సిల్ అవుతాయని హౌజింగ్ అధికారుల హెచ్చరికలతో.. తప్పనిసరి పరిస్థితుల్లో కొందరు లబ్ధిదారులు అధిక ధరకు ఇసుకను కొనుగోలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రేగుబల్లి వద్ద ఇసుక నిల్వలను నిర్ణీత ధరకు కూపన్ల ద్వారా అవసరమైన లబ్ధిదారులకు సరఫరా చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు. ఈ విషయమై టీఎస్ఎండీసీ పీవో శంకర్‌నాయక్‌ను 'ఆంధ్రజ్యోతి' ఫోన్‌లో వివరణ కోరేందుకు ప్రయత్నించగా.. అందుబాటులోకి రాలేదు. కాగా.. పీవో సాధారణంగా ఎవరి ఫోన్లు రిసీవ్ చేసుకోరని, తనకు బాగా తెలిసిన, అవసరం ఉన్నవారి ఫోన్లకు మాత్రమే సమాధానం ఇస్తారనే ప్రచారం జరుగుతోంది.

ప్రపంచంతో పోటీపడాలి

- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

కొత్తగూడెం టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): సంస్థలో పనిచేసే అధికారులు, కార్మికులు నిబద్ధతతో ముందుకు వెళ్లి ప్రపంచంతో పోటీపడాలన్న ఆలోచన ఉండాలని.. అప్పుడే మనం ప్రపంచంతో పోటీ పడగలమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. గురువారం ఆయన విజయవాడ సమీపంలోని ఇబ్రహీంపట్నంలోని సింగరేణి అనుబంధ సంస్థ ఏపీహెచ్ ఎంఈఎల్‌ను సింగరేణి సీఎండీ బలరాంనాయక్‌తో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంతో పోటీపడే స్థాయికి ఆంధ్రప్రదేశ్ హెవీ మిషనరీ ఇంజనీరింగ్ లిమిటెడ్(ఏపీహెచ్ఎంఈఎల్) ఎదగాలన్నారు. అవసరమైన కొత్త యంత్రాలు తయారు చేయడం, పాత యంత్రాల మరమ్మతులకే పరిమితం కాకుండా దేశానికి అవసరమైన ఆర్డర్స్ తీసుకుని బీహెచ్ఈఎల్ మాదిరిగా ఏపీహెచ్ఎంఈఎల్ పని చేస్తుందన్నారు.

పొంగి ప్రవహిస్తున్న

వైరా రిజర్వాయర్



అలుగు పారుతున్న వైరా రిజర్వాయర్

వైరా, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): వైరా రిజర్వాయర్ 19 అడుగుల నీటిమట్టాన్ని దాటి పొంగి ప్రవహిస్తుంది. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటి మట్టం 18.3అడుగులు కాగా గత నాలుగురోజులుగా కురుస్తున్న వర్షాలకు పరివాహక ప్రాంతంలోని వాగులు, ఏర్లు నుంచి భారీగా వరదనీరు వచ్చిచేరుతుంది. దాంతో గురువారం సాయంత్రానికి ఈ నీటిమట్టం 19అడుగులకు చేరుకుంది. వరదనీరు ఇదేవిధంగా కొనసాగితే నీటిమట్టం ఇంకా పెరిగే అవకాశముంది. రిజర్వాయర్‌లోని వరదనీరు అలుగుల నుంచి నదిలోకి పొంగి ప్రవహిస్తూ పరవళ్లు తొక్కుతుంది. స్నానాల లక్ష్మీపురం వద్ద వైరా నదిలో ఉన్న లోలెవల్ చప్టాపైనుంచి వరదనీరు పొంగి ప్రవహిస్తుంది. వైరా తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావు, ఎస్‌ఐ పి.రామారావు ఈ వరదనీటిని పరిశీలించారు. అలాగే సోమవరం నల్లచెరువు అలుగు నుంచి భారీగా వరదనీరు వాగులోకి పొంగి ప్రవహిస్తుంది. గంగదేవిపాడు వాగు, రాళ్లవాగులు కూడా పొంగి ప్రవహిస్తున్నాయి.



బురద దారిలో నడుచుకుంటూ వెళ్తున్న వైద్య బృందం

రహదారి లేక..



చికిత్స చేస్తున్న వైద్యులు

- బురదలో మూడు కిలోమీటర్లు కాలినడక
- వలస ఆదివాసీ గ్రామం అంగారుగూడెంలో వైద్య శిబిరం

కరకగూడెం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా మారుమూల ఏజెన్సీ గ్రామాల ప్రజల సమస్యలు మాత్రం అలాగే ఉంటున్నాయి. వైద్యాధికారి రవితేజ ఆధ్వర్యంలో వైద్య బృందం రహదారి సరిగా లేక బురదలోనే సుమారు మూడు కిలోమీటర్లు కాలినడకన వెళ్లి వైద్యశిబిరం నిర్వహించారు. కరకగూడెం మండలంలోని వలస ఆదివాసీ గ్రామం అంగారుగూడెం గ్రామానికి వర్షాల వల్ల రహదారి బురదమయంగా మారింది. ఆ గ్రామాలకు వాహనాలు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో గురువారం కరకగూడెం వైద్యాధికారి రవితేజ, తన సిబ్బందితో కాలినడకన సుమారు మూడు కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్లి అక్కడ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. బాలింతలకు ప్రత్యేక వైద్య చికిత్స చేశారు. నెలలు నిండిన గర్భిణులను ప్రసవం కోసం మణుగూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. అనంతరం గ్రామంలోని పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాలు కురుస్తున్న క్రమంలో ప్రజలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఇంటి పరిసరాలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఈవో పోలెబోయిన కృష్ణయ్య, హెచ్‌వీ భవాని, హెచ్ఏ నర్సింహారావు, ఏఎన్ఎం జ్యోతి, ఆశావర్కరు మాణిక్యం, ఆధార్ వ్యవస్థాపక అధ్యక్షుడు తోలెం రమేష్ పాల్గొన్నారు.

స్వల్పంగా తగ్గుతున్న

పాలేరు నీటిమట్టం



కూసుమంచి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) పాలేరు జలాశయం నీటిమట్టం స్వల్పంగా తగ్గుముఖం పట్టింది. బుధవారం రాత్రి 24.5 అడుగులున్న నీటిమట్టం 23.5 అడుగులకు చేరుకుంది. మొదటిజోన్ నుంచి 1210క్యూసెక్కులు, పరీవాహక ప్రాంతం నుంచి 8780 క్యూసెక్కులు పాలేరు వచ్చి చేరుతోంది. పాలేరు జలాశయం నుంచి రెండోజోన్‌కు 2043 క్యూసెక్కులు, ఫాలింగ్‌గేట్ల ద్వారా 7667క్యూసెక్కుల నీరు వదులుతున్నారు. అదేవిధంగా ఎడమకాల్వ వరదనీరు పాలేరు జలాశయంచేరకుండా మొదటిజోన్ పరిధిలో రంగుల బ్రిడ్జివద్ద ఎస్కేప్ లాకులు ఎత్తివేశారు. దీంతో పొలాలన్నీ మునిగిపోతున్నాయంటూ రైతులు ఆందోళన వ్యక్తంచేశారు.

కోయ భాష, తెలుగు లిపితో

స్వాతంత్ర్య దినోత్సవ ఆహ్వాన పత్రికలు



భద్రాచలం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా 79వ స్వాతంత్ర్య దిన వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్న క్రమంలో భద్రాచలం ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాల గురించి రూపొందించిన ఆహ్వాన ప్రతికలు కోయ భాష, తెలుగు లిపిలో ముద్రించారు. భద్రాచలం ఐటీడీఏ పీవోగా బీ రాహుల్ బాధ్యతలు చేపట్టిన నాటినుంచి ప్రధాన ఉత్సవాలు, ఇతర వేడుకలకు సంబంధించి ఆహ్వాన పత్రికలను తెలుగుతోపాటు కోయ భాష తెలుగు లిపిలో ముద్రిస్తున్నారు. వీటిని వివిధ విభాగాల ప్రముఖులకు అందజేస్తున్నారు. ఇదిలా ఉండగా శుక్రవారం స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా మార్చ్‌ఫాస్ట్‌కు విద్యార్థులు రిహార్సల్స్ నిర్వహించారు. ఈ సమయంలో పీవో వారికి పలు సూచనలు చేశారు.

సొసైటీ పర్సన్ ఇన్‌చార్జ్‌ల పదవీ కాలం పొడిగింపు

మరో ఆరు నెలలు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు

సత్తుపల్లి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక సహకార సంఘాల అధ్యక్షుడు, సెంట్రల్ బ్యాంకు ఛైర్మన్ల పదవీకాలం మరో ఆరు నెలలు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. జీవో ఆర్టీ నెంబర్ 386 నెంబర్ ద్వారా సహకార సంఘాలు, డీసీసీబీ ఛైర్మన్ల పదవీకాలం పొడిగించారు. ఆరు నెలల క్రితం సహకార పర్సన్ ఇన్‌చార్జ్ పదవీ కాలం పొడిగించగా ప్రస్తుతం ఎన్నికలు నిర్వహించే పరిస్థితి లేకపోవటంతో మరో ఆరు నెలలు పర్సన్ ఇన్‌చార్జ్‌ల పదవీ కాలం పొడిగిస్తూ ఉత్వర్వులు జారీ అయ్యాయి. ఈ మేరకు ప్రభుత్వ కార్యదర్శి రఘునందన్‌రావు ఉత్వర్వులు ఇచ్చారు. దీంతో మరో ఆరు నెలలు లేదా ఈ లోపు ఎన్నికలు జరిగితే అప్పటి వరకూ పాత కమిటీలు కొనసాగనున్నాయి.

'స్థానిక' ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ

- ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలం
- భారతదేశంపై అమెరికా పెత్తనం సహించేది లేదు
- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం



మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని

అశ్వారావుపేట రూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తామని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం ప్రకటించారు. ప్రజా ఉద్యమాలు చేసే సీపీఎంను ప్రజలు ఆదరించాలని కోరారు. గురువారం సాయంత్రం అశ్వారావుపేటలోని సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఒకటి రెండు హామీలు అమలు చేస్తూ ప్రజలను ఆశ పెడుతున్నారన్నారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాలలో ఒంటరిగా పోటీ చేసేందుకు నిర్ణయం తీసుకున్నామన్నారు. ప్రజా ఉద్యమాలు చేసే సీపీఎంను ప్రజలు ఆదరించాలని కోరారు. అమెరికా నుంచి సోయా, మొక్కజొన్న, కోడి మాంసం, పాల ఉత్పత్తులను మనదేశంలోకి పంపేందుకు ట్రంప్ సుంకాలు విధిస్తున్నారని, దీని ద్వారా మన ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో పడుతుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కూడా అమెరికా పోకడలపై మాట్లాడారని గుర్తుచేశారు. కేంద్రం కూడా చైనా మాదిరిగా నిర్దిష్ట విధానంలో ముందుకు సాగాలని సూచించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు మాట్లాడుతూ.. ఉమ్మడి ఖమ్మం జిల్లాపై పాలకులు ఎనలేని నిర్లక్ష్యం చూపుతున్నారన్నారు. పెదవాగు ప్రాజెక్టు తెగి ఏడాది గడిచినా.. నేటికీ మరమ్మతులు చేపట్టలేదన్నారు. అంతకు ముందు మండలంలోని నందిపాడులో మాజీ సర్పంచి ఊకే వీరాస్వామి దశదిన కర్మలో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ నాయకులు అన్నవరపు కనకయ్య, జిల్లా నాయకులు పుల్లయ్య, మండల కార్యదర్శి ప్రసాద్, జిల్లా నాయకులు చిరంజీవి, సత్యనారాయణ, శ్రీనివాసరావు, వెంకటేశ్వరావుతో పాటు పలువురు పాల్గొన్నారు.

'పెద్దపులి' కోసం

గాలింపు

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన అటవీ అధికారులు



సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్న అటవీ శాఖ అధికారులు

కరకగూడెం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి, ములుగు జిల్లా సరిహద్దులో పెద్ద పులి సంచరిస్తున్నట్లు ఇరుజిల్లాల అటవీ శాఖ అధికారులు తెలుపుతున్నారు. గురువారం ఏడూళ్ళ బయ్యారం రేంజర్ తేజస్వీ ఆధ్వర్యంలో టైగర్ భద్ర జాడ కోసం ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. ముసలమ్మ గుట్ట ప్రాంతంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్లు గోవింద్, వెంకటమ్మ, సూరయ్య, ఏడుకొండలు, బీట్ ఆఫీసర్లు అశోక్, రోజ, గోపి, కోటేష్, లక్ష్మి నర్సు, సురేష్, రాజేష్, స్వప్న, గోవర్ధన్, మోహన్, బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండండి

- ఆస్తి, ప్రాణ నష్టం సంభవించకుండా చూడండి
- వరద సహాయక చర్యలకు జిల్లాకు రూ. కోటి
- వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులు తుమ్మల, పొంగులేటి
- పాల్గొన్న ఖమ్మం, భద్రాద్రి జిల్లాల కలెక్టర్లు

ఖమ్మం కలెక్టరేట్ / కొత్తగూడెం కలెక్టరేట్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో అల్పపీడనం వల్ల కురుస్తున్న భారీ వర్షాలకు అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి కోరారు. వరదల వల్ల ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించకుండా చర్యలు తీసుకోవాలని వారు సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గురువారం ఖమ్మం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.. హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీఎస్ కే. రామకృష్ణారావుతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో పాటు భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రులు తుమ్మల, పొంగులేటి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలలో రెండు రోజుల నుంచి భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయని తెలిపారు. వాతావరణ శాఖ సూచనల ప్రకారం వరదల సమయంలో ఆస్తి, ప్రాణ నష్ట నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. వరద పరిస్థితులపై ముఖ్యమంత్రి ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారని, ప్రజలకు ఎక్కడా ఆస్తి నష్టం, ప్రాణ నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. వరద సహాయక చర్యలు చేపట్టేందుకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలకు ముందస్తుగా కోటి రూపాయల చొప్పున ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. అవసరమైతే మరిన్ని నిధులను కూడా విడుదల చేస్తామన్నారు. వరదల వల్ల నష్టపోయిన ప్రజలకు పరిహారం అందించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలన్నారు. వరద సహాయక చర్యల్లో పోలీసు యంత్రాంగం సహకారం పూర్తిస్థాయిలో తీసుకోవాలన్నారు. రోడ్లు, క్యాజ్ వేల డామేజీ, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల డ్యామేజీ ఉంటే చేపట్టాలన్నారు. వైద్యపరంగా అంటు వ్యాధులు ప్రబలకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు, సిబ్బందికి సెలవులు ఇవ్వొద్దన్నారు. ఉమ్మడి జిల్లాలకు ఒక ప్రిన్సిపల్ కార్యదర్శి స్థాయి అధికారిని నియమించి.. పర్యవేక్షణ చేస్తున్నట్లు అన్నారు. ఎక్కడ అనుకోని సంఘటనలు జరిగినా.. ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలను వినియోగించాలన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. జిల్లాకు సంబంధించి ఇప్పటివరకు సమస్యలు లేవన్నారు. ఆకేరు, మున్నేరు, పాలేరు, వైరా, లంకాసాగర్‌లు నిలకడగా ఉన్నాయన్నారు. పొరుగున ఉన్న మహబూబాబాద్, వరంగల్ జిల్లాల్లో వర్షపాతాన్ని బట్టి ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. పాఠశాలలకు సెలవులు ప్రకటించామన్నారు. రేపు, ఎల్లుండి వాతావరణ ప్రభావాన్ని బట్టి అప్రమత్తంగా ఉండాలన్నారు. కల్వర్టులు, క్యాజ్ వేల దగ్గర ప్రజలు దాటకుండా చూడాలని, చెరువులను నిరంతరం పర్యవేక్షణ చేయాలని మంత్రి అన్నారు. సీఎస్ కే. రామకృష్ణారావు మాట్లాడుతూ.. వాతావరణ శాఖ సూచనల ప్రకారం మెదక్, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసిందన్నారు. మిగిలిన ప్రాంతాల్లో కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపిందన్నారు. వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, జిల్లాలో అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో కలెక్టర్ వద్ద ఉన్న డిజాస్టర్ నిధులను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని సీఎస్ సూచించారు. అనంతరం ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ.. జిల్లాలో ఎన్ని రోడ్లు, క్యాజ్ వేలు బ్లాక్ అయినది అధికారులు వెంటనే నివేదిక సమర్పించాలన్నారు. అందరూ మండల అభివృద్ధి అధికారులు, తహసీల్దార్లు, మునిసిపల్ కమిషనర్లు వారి వద్ద అందుబాటులో ఉన్న వరద సహాయక పరికరాల వివరాలు ఇవ్వాలన్నారు. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల డ్యామేజ్, పవర్ కట్ జరిగిన ప్రదేశాల వివరాలు ఇవ్వాలన్నారు. జిల్లాలోని అన్ని చెరువులు సర్ ప్లస్ స్థాయిలో ఉండరాదని, గరిష్ఠంగా 85 నుంచి 90 శాతం నీరు ఉండేలా చూడాలన్నారు. వర్షాలు పడిన చోట యుద్ధ ప్రాతిపదికన పారిశుధ్య చర్యలు చేపట్టాలని, ఫీవర్ సర్వే ప్రారంభించాలని, పరీక్షలు ర్యాండంగా చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఖమ్మం జిల్లా రెవెన్యూ అధికారిణి ఏ. పద్మశ్రీ, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ కళావతి బాయి, ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాస్, ఎస్ఈ శ్రీనివాసాచారి, మంగళపూడి. వెంకటేశ్వర్లు, వెంకట్‌రెడ్డి, మిషన్ భగీరథ ఈఈలు పుష్పలత, వాణిశ్రీ, జిల్లా మత్స్య శాఖ అధికారి శివప్రసాద్, జిల్లా అగ్నిమాపక, ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ అధికారులు పాల్గొన్నారు.

● **భద్రాద్రి జిల్లాలో సాధారణ వర్షపాతం**

వీడియో కాన్ఫరెన్స్‌లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ.. జిల్లాలో సాధారణ స్థాయిలో వర్షపాతం నమోదైందని తెలిపారు. చంద్రుగొండ మండలం మద్దుకూరు గ్రామంలో మాత్రం గరిష్టంగా 12.7 సెం.మీటర్ల వర్షపాతం నమోదైందన్నారు. ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగలేదన్నారు. క్షేత్రస్థాయిలో ఇరిగేషన్, వ్యవసాయ శాఖాధికారులు పరిశీలన జరపాలన్నారు. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి జిల్లాలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. భద్రాచలంలో ఎన్డీఆర్ఎఫ్ బృందం, పాల్వంచలో ఎస్డీఆర్ఎఫ్ బృందం, కొత్తగూడెం డివిజన్ పరిధిలోని చాతకొండ బెటాలియన్‌లో వంద మంది పోలీసులు శిక్షణ పొంది ఉన్నారని తెలిపారు. అదేవిదంగా రోపులు, లైఫ్‌జాకెట్స్, టార్చ్‌లైట్స్ బోట్స్‌ను సిద్ధం చేశారన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్, ట్రైనీ కలెక్టర్ సౌరభ్‌శర్మ, జడ్పీ సీఈఓ నాగలక్ష్మి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

21న సీఎం పర్యటన

- ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే జారే, ఎస్పీ రోహిత్‌రాజ్



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

చంద్రుగొండ, ఆగస్టు (ఆంధ్రజ్యోతి): ఆదర్శ గ్రామం బెండాలపాడులోని ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభించేందుకు ఈనెల 21న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వస్తున్నట్లు ఎమ్మెల్యే జారె ఆదినారాయణ తెలిపారు. ఈ మేరకు పర్యటన ఏర్పాట్లను గురువారం అశ్వారావుపేట ఎమ్మెల్యే, నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, ఎస్పీ రోహిత్‌రాజుతో కలిసి బెండాలపాడులో పర్యటించారు. గ్రామంలో సీఎం సభ, హెలీప్యాడ్ ప్రాంగణాలతోపాటు ముఖ్యమంత్రి గ్రామంలో ప్రారంభించే ఇళ్లపై ఎమ్మెల్యే, ఎస్పీ చర్చించారు.


రాష్ట్రానికే ఆదర్శంగా నిలవాలి: కలెక్టర్ జితేష్ వి పాటిల్

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ఆదర్శ గ్రామంగా గుర్తించిన బెండాలపాడు రాష్ట్రానికే ఆదర్శ గ్రామంగా నిలిపేందుకు కృషి చేయాలని భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులు, లబ్ధిదారులను కోరారు. గురువారం మండలంలోని బెండాలపాడులో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ తీరుతెన్నులను పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులతో సమావేశమై ఇళ్ల నిర్మాణంలో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

అనంతరం కలెక్టర్ విలేకరులతో మాట్లాడుతూ బెండాలపాడు గ్రామంలో 310 ఇళ్లు మంజూరు కాగా ఇప్పటికే 46 ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకొని గృహ ప్రవేశానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కాగా మిగతా ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో వేగంగా కొనసాగుతున్నాయన్నారు.

మంత్రి హోదాలో అత్యధిక సార్లు

జాతీయజెండా ఆవిష్కరించిన తుమ్మల



ఖమ్మం, ఆగస్టు14(ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఉమ్మడి రాష్ట్రంలోను, తెలంగాణలోను రాష్ట్రమంత్రి హోదాలో అత్యధికసార్లు ఆగస్టు 15న జాతీయజెండా ఎగువరేసే అవకాశం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు దక్కుతుంది. ఉమ్మడి రాష్ట్రంలో ఎన్టీఆర్, చంద్రబాబునాయుడు, రాష్ట్ర విభజన అనంతరం కేసీఆర్, ముఖ్యమంత్రి రేవంతరెడ్డి కేబినేట్‌లో మంత్రి హోదాలో ఆగస్టు 15 సందర్భంగా జాతీయ జెండాను ఎగురవేశారు. శుక్రవారం ఆగస్టు 15 సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జాతీయ జెండా ఎగురవేయబోతున్నారు. తొలిసారి 1986 ఆగస్టు15న ఖమ్మం పోలీసుపరేడ్ గ్రౌండ్‌లో జాతీయ1989వరకు ఎన్టీఆర్‌కేబినేట్‌లో మంత్రిగా జెండా ఎగురవేశారు. తర్వాత చంద్రబాబు కేబినేట్‌లో 1995నుంచి 2024వరకు జాతీయజెండా ఎగురవేశారు. రాష్ట్ర విభజన అనంతరం కేసీఆర్ కేబినేట్‌లో మంత్రిగా ఖమ్మంలో 2015నుంచి 2018వరకు జాతీయజెండా ఎగురవేశారు. ఆతర్వాత మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి హోదాలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రం కొత్తగూడెంలో మంత్రిగా జాతీయజెండా ఎగురవేయనున్నారు. రాష్ట్ర మంత్రిగా అత్యధిక సార్లు జాతీయజెండా ఎగురవేసే అవకాశం మంత్రి తుమ్మలకు దక్కుతుంది.

దంచికొట్టిన వాన

(7వ పేజీ తరువాయి)

చేగొమ్మ- తాళ్లచెరువు, జీళ్లచెరువు-చేగొమ్మ మధ్య రాకపోకలునిలిచాయి. సింగరేణి ఓపెన్‌కాస్టులో 30వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం కలిగింది.

భద్రాద్రి జిల్లాలో...



ఎదుళ్ల వాగు వద్ద పరిస్థితిని పరిశీలిస్తున్న ఎస్పీ

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనూ భారీ వర్షపాతం పడింది. జిల్లాలో బుధవారం రాత్రి నుంచి మొదలైన వర్షం గురువారం తెల్లవారుజాము వరకు కొనసాగింది. పెద్ద ఎత్తున వర్షం పడడంతో పొలాలు నీట మునిగాయి. చెరువులు, వాగులు వంకలు పొంగిపొర్లాయి. రాష్ట్రంలోనే అత్యధికంగా చంద్రుగొండ మండలంలోని మద్దుకూరులో 12.78 సెం.మీ వర్షపాతం నమోదైంది. అలాగే అశ్వారావుపేటలో 10.3 సెంమీ, బూర్గంపాడులో 8.25, దమ్మపేట మండలం అంకంపాలెంలో, భద్రాచలంలో 7.55, చుంచుపల్లి మండలం గరిమెళ్లపాడులో 7.5, దుమ్ముగూడెంలో 7.4, దమ్మపేట మండలం మందపల్లిలో 7.38, అన్నపురెడ్డిపల్లి పెంట్లంలో 7.2 సెంమీ, పాల్వంచ మండలం సీతారామపురంలో 6.4, దమ్మపేట మండలం నాగుపల్లె లో 6.1, లక్ష్మీదేవిపల్లిలో 5.78, సుజాతనగర్‌లో 5.65, కొత్తగూడెంలో 5.2 సెంమీ వర్షపాతం నమోదైంది. ఆ తర్వాత టేకులపల్లిలో 4.4, మణుగూరు లో 4.1, మణుగూరులో 3.8, పాల్వంచ మండలం యానంబైలులో 3.6, చర్ల మండలం సత్యనారాయణపురం 2, ఆళ్లపల్లి మండలంలో 1.98 సెంమీ వర్షపాతం నమోదైంది.

'సీతారామ' నీటి విడుదలకు ఏడాది

(7వ పేజీ తరువాయి)

లిఫ్టులు నిర్మించి వంద కి.మీ మేర ప్రధాన కాలువను తవ్వి వదిలేశారు. అశ్వాపురం మండలం అమ్మగారిపల్లి నుంచి గ్రావిటీ ద్వారా గోదావరి జలాలను బీజీ కొత్తూరు వద్ద ఎత్తిపోతలను నిర్మించారు. అక్కడ నుంచి లిఫ్టుద్వారా ములకలపల్లి మండలం పూసుగూడెం వద్ద రెండో లిఫ్టు ఏర్పాటు చేశారు. మూడో లిఫ్టు ములకలపల్లి మండలం కమలాపురం వద్ద నిర్మించారు. పాలేరు రిజర్వాయర్‌కు గోదావరి జలాలను అనుసంధానం చేసేందుకు జూలూరుపాడు వద్ద వంద కి.మీకు పైగా తవ్వి వదిలేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టును కాంగ్రెస్ అధికారంలోకి రాగానే వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం మంత్రుల బృందం సీతారామ ప్రారంభం నుంచి చివరి వరకు పనులు పరిశీలించి సాగర్ ఎడమ కాలువకు సీతారామ ప్రధాన కాలువను అనుసంధానం చేసే ఏన్కూరు లింక్‌కెనాల్ పెరిగిన అంచనాలకు ఆమోదం తెలిపారు. సుమారు రూ.90కోట్లు మంజూరు చేసి ఏన్కూరు లింక్ కెనాల్ పూర్తిచేసి రాజీవ్ లింక్‌కెనాల్‌గా పేరు పెట్టారు. గతేడాది ముఖ్యమంత్రి చేతుల మీదుగా సీతారామ ఎత్తిపోతలను లిఫ్టులను ప్రారంభించి గోదావరి జలాలను ఏన్కూరు లింక్ కెనాల్ ద్వారా సాగర్ ఎడమ కాలువకు అనుసంధానం చేసి నీటిని వదిలారు. దీంతో అసంపూర్తిగా ఉన్న సీతారామ ఎత్తిపోతల వినియోగంలోకి వచ్చింది.

అనంతరం సీతారామకు సంబంధించిన పాలేరు లింక్‌కెనాల్ ,యాతాలకుంట టన్నెల్ పనులు కూడా వేగవంతంగా చేపడుతున్నారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరక సీతారామలోని మిగిలిన ప్యాకేజీల టెండర్లు కూడా పూర్తి చేశారు. ప్రాజెక్టు అంచనాలు పెరగడంతో ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన మంత్రివర్గం సమావేశంలో పెరిగిన అంచనాలకు ఆమోదం లభించింది. దీంతో సీతారామకు నిధుల సమస్య తప్పింది. ఇప్పటికే రాజీవ్ లింక్‌కెనాల్ ద్వారా సాగర్ ఆయకట్టుకు అనుసంధానం చేసి ఇటీవల వర్షాభావ నేపథ్యంలో వైరా రిజర్వాయర్‌కు కల్లూరు వైపుగా గోదావరి జలాలను పంపి పంటలను కాపాడగలిగారు. గతేడాది పాలేరు వరదకారణంగా అప్రోచ్ కొట్టుకుపోవడంతో నీటి ఎద్దడి ఏర్పడినప్పుడు సీతారామ ద్వారా గోదావరి జలాలను వదిలి కల్లూరు తదితర మండలాల రైతుల పంటలను కాపాడగలిగారు. ఉమ్మడి జిల్లాలో పలు నియోజకవర్గాల్లో రూ.3500కోట్లతో 8 డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్‌కు టెండర్లు చేపట్టారు.

ప్రస్తుతం ఇందుకు భూసేకరణ కొనసాగుతోంది. తద్వారా ఖమ్మం, కొత్తగూడెం, మహబూబాద్ జిల్లాల పరిధిలోని 11 నియోజకవర్గాలు, 31 మండలాల్లో 3లక్షల29వేల ఎకరాల కొత్త ఆయకట్టు సాగులోకి రాబోతుంది. ప్రస్తుతం సాగర్‌తో పాటు పలు చెరువులు కింద 3లక్షల45వేల ఎకరాలు స్థిరీకరణ జరగనుంది. కేబినేట్ ఆమోదంతో నిధుల సమస్య తీరడంతో భూసేకరణ వేగవంతం అయి డిస్ట్రిబ్యూటరీ కెనాల్ పనులు వేగంగా జరగనున్నాయి. వచ్చే ఆగస్టు 15కల్లా సీతారామ పనులు పూర్తయితే ఉమ్మడి జిల్లా మరింత సస్యశ్యామలం కానుంది.

భద్రాద్రి రామయ్య, నిత్యకల్యాణం



భద్రాచలం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారికి గురువారం నిత్య కళ్యాణం ఘనంగా నిర్వహించారు. . అలాగే బేడా మండపంలో స్వామి వారి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేన పూజ, పుణ్యాహావచనం, కంకణదారణ, జీలకర్రబెల్లం, మాంగల్యదారణ, తలంబ్రాలు, వేద ఆశీర్వచనం నిర్వహించారు.ఈ కార్య క్రమంలో ఉప ప్రధాన అర్చకులు కోటి శ్రీమన్నారాయణాచార్యులు పాల్గొన్నారు.

జిల్లాలో భారీ వర్షం

» 109.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు » పొంగిన వాగులు

» లోతట్టు ప్రాంతాలు జలమయం » విద్యుత్ సరఫరాకు అంతరాయం





పామాయిల్ తోటలో వరదనీటి ప్రవాహం, దుమ్ముగూడెం మండలం మారేడుబాక వద్ద వరదనీరు

అశ్వారావుపేట రూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో అశ్వారావుపేట మండలంలో బుధవారం రాత్రి భార్షం పడగా గురువారం మధ్యాహ్నం మాదిరి వర్షం పడింది. గంటన్నర వ్యవధిలోనే ఆకాశానికి చిల్లుపడిందా అనే విధంగా భారీ వర్షం అతలాకుతలం చేసింది. అశ్వారావుపేటతో పాటు మండలంలోని అనేక గ్రామాల్లో రాత్రి ఏడున్నరకు వర్షం ప్రారంభమై గంటన్నర పాటు భారీగా పడింది. అశ్వారావుపేటలో 24గంటల వ్యవధిలో 109.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు అయింది. భారీ వర్షంతో బుధవారం రాత్రి అశ్వారావుపేటలోని లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. నల్లబాడువాగు వద్దకు వెళ్లిన డీఎల్‌పీవో ప్రభాకర్, ఎంపీవో రామారావు పంచాయతీ సిబ్బందితో మాట్లాడారు. మండలంలోని మధ్యతరహా జలాశయం పెదవాగుప్రాజెక్టుకు కూడా భారీగా వరదనీరు వచ్చినా గేట్లు ఎత్తివేసి ఉండటంతో నీరంతా గోదావరిలోనే కలిసిపోతుంది. తెగిన ప్రాజెక్టుకు పూర్తి మరమ్మతులు చేయకపోవటంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

రహదారిపై కూలిన భారీవృక్షం



నేలకూలిన

అశ్వాపురం(ఆంధ్రజ్యోతి): భారీ వర్షంతో మండల పరిధిలోని జగ్గారం గ్రామసమీపంలో గురువారం తెల్లవారుజామున కొత్తగూడెం-మణుగూరు ప్రధాన రహదారిపై భారీ వృక్షం నేలకూలింది. దీంతో ట్రాఫిక్‌కు గంటసేపు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న అశ్వాపురం సీఐ అశోక్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని ఎక్స్‌కవేటర్ సహాయంతో రహదారిపై చెట్టును తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

దమ్మపేటలో 9సెంమీ వర్షపాతం

దమ్మపేట (ఆంధ్రజ్యోతి): దమ్మపేట మండలంలో బుధవారం అర్ధరాత్రి నుంచి బారీ వర్షం పడింది. దీంతో ప్రదాన రహదారులు జలమయ్యాయి. మండలంలో 9సెంమీ వర్షపాతం నమోదు అయింది. వర్షం వల్ల రాత్రి సమయంలో విద్యుత్ అంతరాయం ఏర్పడటంతో ఇబ్బందులు పడ్డారు.

రహదారులపై పారిన వరదనీరు

దుమ్ముగూడెం (ఆంధ్రజ్యోతి):బుధవారం రాత్రి కురిసిన వర్షానికి మండలంలోని పలు చోట్ల రహదారులపై వరదనీరు పొంగిపొర్లింది. పార్కెలు చెరువు నిండడంతో అలుగు పడి లక్ష్మీనగరం-మారాయిగూడెం ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిపై రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పోలీసులు, గ్రామపంచాయతీ సిబ్బంది కలిసి బారికేడ్లు ఏర్పాటు చేసి రాకపోకలను కొంతసేపు నిలిపివేశారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

సుజాతనగర్, (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సుజాతనగర్ తహసీల్దార్ ఎం.ప్రసాద్ ప్రజలకు సూచించారు. గురువారం తన సిబ్బందితో కలిసి లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ భారీ వర్షాలకు సుజాతనగర్ మండల పరిధిలోని వాగులు, వంకలు పొంగి పొరలుతున్నాయన్నారు. లక్ష్మీదేవిపల్లి చప్టా వద్ద నీటి ప్ర వాహాన్ని పరిశీలించారు. లక్ష్మీదేవిపల్లి రైల్వే లైన్ అండర్ బ్రిడ్జి వద్ద నీటి నిల్వ ఉండటంతో అటు నుంచి రాకపోకలు సాగించే వారు జాగ్రత్తగా నడపాలన్నారు.

జయమ్మకాలనీ రోడ్డుకు మోక్షం

●రోడ్డును పరిశీలించిన కార్పొరేషన్ కమిషనర్ సుజాత

పాల్వంచ టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధి కాంట్రాక్టర్స్ కాలనీ నుంచి జయమ్మకాలనీ వరకు రోడ్డు విస్తరణ, నిర్మాణ పనులకు త్వరలో మోక్షం లభించనుంది. ఈ మేరకు కార్పొరేషన్ కమిషనర్ సుజాత, టౌన్ ప్లానింగ్ అధికారులు గురువారం రోడ్డు విస్తరణకు ఆటంకంగా ఉన్న నిర్మాణాలను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ రోడ్డు విస్తరణకు కొంతకాలంగా గృహ నిర్మాణాలు ఆటంకంగా ఉండటంతో యజమానులకు వారం రోజుల్లోపు తమ స్థల డాక్యుమెంట్లను సమర్పించాలని నోటీసులు ఇచ్చామన్నారు. స్థల డాక్యుమెంట్లను పరిశీలించి, నిబంధనలకు వ్యతిరేకంగా ఉన్న ఆక్రమణలను తొలగించి త్వరలో రోడ్డు నిర్మాణ పనులను చేపడతామన్నారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ నవీన్ కుమార్, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సంతాపసభలో పాల్గొన్న మాజీ ఎంపీ

దుమ్ముగూడెం ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మంగువాయిబాడవలో గురువారం సీపీఎం నాయకుడు కల్లూరి వీరభద్రం సంతాపసభలో మాజీ ఎంపీ డాక్టర్ మిడియం బాబూరావు పాల్గొని ఘన నివాళులర్పించారు. వీరభద్రం మృతి పార్టీకు తీరని లోటన్నారు. మాజీ డీసీసీబీ చైర్మన్ యలమంచి రవికుమార్, కారం పుల్లయ్య, చంద్రయ్య, శ్రీనుబాబు, వంశీకృష్ణ, చిలకమ్మ, ఖాదర్‌బాబు, లక్ష్మయ్య, శిల్పకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మనస్థాపంతో యువకుడి ఆత్మహత్య

అశ్వారావుపేటరూరల్, ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిస కావటం, భార్య పుట్టింటికి వెళ్లటంతో మనస్థాపానికి గురై ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండలంలో గురువారం జరిగింది. ఎస్ఐ యయాతిరాజు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఊట్లపల్లి గ్రామానికి చెందిన తాటి రాజు(24)స్థానికంగా ఓ మిల్లులో పని చేస్తున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిసై పనికి వెళ్లటం లేదు. ఈనేపథ్యంలో ఈనెల 12న భార్య లతకు, రాజుకు మధ్య వాగ్వాదం జరగింది. దీంతో లత పుట్టింటికి వెళ్లింది. ఈనెల13న రాజు తిరిగి మిల్లులో పనికి వెళ్లి మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వచ్చాడు.తిరిగి మిల్లుకు రాకపోవటంతో యజమాని కేశవరావు ఇంటికి వచ్చాడు. తలుపులు తీసి చూడగా రాజు అపస్మారకస్థితిలో పడి ఉన్నాడు. పురుగుల మందు తాగటాన్ని గమనించిన కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చాడు. ఆస్పత్రికి తరలింగా ఖమ్మంలో చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యయాతిరాజు వివరించారు.

యువకుడిపై దాడి

పాతకక్షల నేపథ్యంలో ఘటన

పాల్వంచ,ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): పాత కక్షల నేపథ్యంలో యువకుడిపై మరో వర్గానికి చెందిన ఐదుగురు యువకులు దాడి చేసిన సంఘటన పాల్వంచలో గురువారం చోటు చేసుకుంది. నడిరోడ్డుపై సదరు యువకుడిని పట్టుకుని ఐదుగురు కలిసి విచక్షణారహితంగా దాడి చేయడం సంచలనంగా మారింది. శ్రీనగర్ కాలనీకి చెందిన నరేష్‌కు అదే కాలనీకి చెందిన ఉపేందర్‌కు పాతగొడవలు ఉన్నాయి. ఈ క్రమంలో మధ్యాహ్నం అంబేద్కర్ సెంటర్ వైపు వస్తున్న నరేష్‌ను ఉపేందర్, అతని స్నేహితులు అడ్డగించారు. అతడిపై పిడిగుద్దులతో దాడి చేశారు. ఈ దాడిలో నరేష్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులనుంచి సమాచారం అందుకున్న బ్లూకోట్ కానిస్టేబుల్ హుస్సేన్ వెంటనే అక్కడకు చేరుకుని అల్లరి మూకను చెదరగొట్టాడు. గాయపడిన యువకుడు నరేష్‌ను పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాడు. దాడికి పాల్పడిని యువకులు ఐదుగురిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. దాడికి పాల్పడిన యువకులపై కేసు నమోదు చేయనున్నట్లు టౌన్ ఎస్ఐ సుమన్ తెలిపారు. దాడికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

గంజాయి కేసులో రెండేళ్ల జైలు

కొత్తగూడెం లీగల్, ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణకేసులో పట్టుబడిన జున్ను మనోహర్ అనే నిందితుడికి గురువారం కొత్తగూడెం మొదటి అదనపు జిల్లా సెషన్ జడ్జీ సరిత రెండు సంవత్సరాల జైలు శిక్ష, రూ.20వేలు జరిమాన విదిస్తూ తీర్పునిచ్చారు. ద్వి చక్రవాహనంపై నిందితుడు 7.250 కేజీల గంజాయిని రవాణా చేస్తుండగా ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 2023 ఎక్సైజ్ పోలీసుల ఈకేసు నమోదుచేసి చార్జిషీట్ కోర్టులో దాఖలు చేశారు. నింధితుడు మనోహ ర్ హనుమకొండకు చెందిన వాడు. ప్రాసిక్యూషన్ తరుపున పీపీడి లక్ష్మీ వాదించగా పాల్వంచ ఎక్సైజ్ కానిస్టేబుల్ రామకృష్ణ సహకరించారు.

ఆరుగురు మావోయిస్టుల లొంగుబాటు

కొత్తగూడెం, ఆగస్టు14 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీలో పలు స్థాయిలలో పని చేస్తున్న ఆరుగురు మావోయిస్టులు గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు ఎదుట లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో పీపీసీఎం/ఏసీఎం సభ్యులు ఒకరు, పార్టీ సభ్యులు ఇద్దరు, మిలిషీయా సభ్యులు ముగ్గురు ఉన్నారు. లొంగిపోయిన మావోయిస్టు సభ్యులకు ఎస్పీ రోహిత్ రాజు తక్షణ సహాయం కింద ఒక్కొక్కరికి రూ.25వేలను అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లా పోలీసులు, 81, 141 సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ అధికారులు ఆదివాసీ ప్రజల సంక్షేమం కోసం నిర్వహిస్తున్న ఆపరేషన్ చేయూత కార్యక్రమం ద్వారా వారు లొంగిపోయినట్టు ఎస్పీ తెలిపారు. ఇప్పటివరకు పలు హోదాల్లో పనిచేసిన మావోయిస్టు దళ సభ్యులు 306 మంది జనజీవన స్రవంతిలో కలిసి పునరావాస సౌకర్యాలను పొందారన్నారు. అభివృద్ధితో కూడిన ప్రజల శాంతియుత నినాదమే పోలీసు నినాదమన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో హర్‌ఘర్ తిరంగా ర్యాలీ



కొత్తగూడెంలో తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

లక్ష్మీదేవిపల్లి/ భద్రాచలం/ దుమ్ముగూడెం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): దేశ సమగ్రతకు ఏకత్వానికి చాటిచేప్పేవిధంగా తిరంగా ర్యాలీని నిర్వహిస్తున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం బీజేపీ ఆధ్వర్యంలో కొత్తగూడెం, భద్రాచలం, దుమ్ముగూడేల్లో హర్‌ఘర్‌తిరంగా ర్యాలీ నిర్వహించారు.

ముందస్తుగా కృష్ణాష్టమి వేడుకలు



జూలూరుపాడు/మణుగూరు ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో కృష్ణాష్టమి వేడుకలు ముందస్తుగా నిర్వహించారు. జూలూరుపాడు మండలం వెంగన్నపాలెంలో ని సెయింట్ ఆంథోని పాఠశాల, మణుగూరు లోని బ్రైట్ మైండ్ ప్లే స్కూల్‌లో వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు, చిన్ని కృష్ణుడిగా, గోపికలుగా వేషాధారణ గావించారు. వారి వేషధారణలు ఆకట్టుకున్నాయి. ఉట్టి కొట్టి సందడి చేశారు. పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

' కాంగ్రెస్ చేసిన అభివృద్ధి 'రేగా'కు కనిపించటం లేదా'

భద్రాచలం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రేగా కళ్లు ఉండి చూడ లేని కబోదివా? మా ప్రభుత్వం చేసిన అభివృద్ధి కనిపించటం లేదా అని మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావును భద్రాచలం మండల కాంగ్రెస్ నాయకులు ప్రశ్నించారు. గురువారం భద్రాచలం కాంగ్రెస్ నాయకులు రత్నం రమాకాంత్, బొంబోతుల రాజీవ్, భీమవరపు వెంకటరెడ్డి, నర్రా రాము, అరికెళ్ల తిరుపతిరావు ఈ మేరకు ఓ ప్రకటనను విడుదల చేశారు. గతంలో భ ద్రచలం అభివృద్ధికి రూ 100 కోట్లు తరువాత రూ 1000 కోట్లు అప్పటి బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో హామీ ఇచ్చి గుండు సున్నా చూపించిన చరిత్ర మీది కాదా అని ప్రశ్నించారు.భద్రాచలం ఎమ్మెల్యే గురించి మాట్లాడితే ప్రజలు ఉరికిస్తారని స్పష్టం చేశారు. రామాలయ అభివృద్ధికి రూ 63 కోట్లు నిధులు తీసుకువచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనన్నారు.

యూరియా కొరతను తీర్చాలి: బీఆర్‌ఎస్

జూలూరుపాడు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో రైతులు యూరియా దొరకక ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బీఆర్‌ఎస్ పార్టీ వైరా నియోజకవర్గ నాయకుడు లకావత్ గిరిబాబు ఆరోపించారు. యూరియా కొరతను తీర్చాలని కోరుతూ గురువారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో జూలూరుపాడులో సొసైటీ చైర్మన్ చీమలపాటి భిక్షానికి వినతి పత్రాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పాలనలో యూరియా కోసం రైతులు ఎప్పుడూ పడిగాపులు కాసిన పరిస్థితులు లేవని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వమే యూరియా కొరతను సృష్టిస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు చాపలమడుగు రామ్మూర్తి, హేమ్లా, నాయకులు సేవా, రైతులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య వేడుకలకు ముస్తాబు



ప్రకాశం మైదానంలో ఏర్పాట్లు

కొత్తగూడెం కలెక్టరేట్,ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): 79వ స్వాతంత్ర్య వేడుకలకు భద్రాద్రి కొత్తగూడెం లోని ప్రగతిఠ మైదానం రంగ రంగ వైభవంగా తీర్చిదిద్దారు. గురువారం కలెక్టర్ జితేష్ విపాటిల్ ప్రగతి మైదానాన్ని సందర్శించి అధికారులకు తగిన సూచనలు ఇచ్చారు. వర్షాన్ని సైతం ఎదుర్కొనే విధంగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వేడుకలకు ముఖ్య అతిథిగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హజరై జాతీయ జెండాను అవిష్కరిస్తారన్నారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్లు డి. వేణుగోపాల్, విద్యాచందన పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు నగదు, ప్రశంసా పత్రాలు

2024- 2025 విద్యాసంవత్సరంలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో అత్యధిక మార్కులు సాదించిన విద్యార్థులకు 79 వ స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా నగదు, ప్రశాంస పత్రాలను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతులమీదుగా అందజేయనున్నారు. పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాదించిన కే. మహేష్ (జిల్లా పరిషత్ హై స్కూల్ మణుగూరు), జి. సంతోష్ (జిల్లా పరిషత్ హై స్కూల్ గండుగులపల్లి). ఎస్‌కే. యాస్మిన్ బేగం (జిల్లా పరిషత్ హై స్కూల్ అశ్వారావుపేట), రవళి (జిల్లా పరిషత్ హై స్కూల్ మామిళ్ళవారి గూడెం), ఇంటర్మీడియట్‌లో పీ సౌమ్య(కేజీబీవి ములకలపల్లి), వి. ప్రవళిక (టీజీఆర్‌ఐఈఎస్ బూర్గంపాడు) ఉన్నారు. ఒక్కోక్క విద్యార్ధికి రూ.10వేల నగదు, ప్రశాంస పత్రం అందజేయనున్నారు.

ప్రకాశం మైదానం ముస్తాబు

కొత్తగూడెం టౌన్, (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించే 79 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు కొత్తగూడెంలో ప్రకాశం మైదానాన్ని ముస్తాబు చేశారు. సింగరేణి సివిల్, వెల్ఫేర్ అధికారులు ఏర్పాట్లును పూర్తిచేసి సర్వం సిద్ధం చేశారు. ముఖ్య అతిథిగా సింగరేణి సీఎండీ బలరాంనాయక్ హజరుకానున్నారు.

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం: ఎమ్మెల్యే జారే



ఎక్స్‌రే యూనిట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జారే

అశ్వారావుపేట రూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం అధిక మొత్తంలో నిధులను ఖర్చు చేస్తుందని, అశ్వారావుపేట ఏరియా ఆసుపత్రిలో అన్ని రకాల సౌకర్యాలు కల్పించి పేదలు ఎటు వెళ్లకుండా ఇక్కడే వైద్యం పొందేలా ప్రత్యేక దృష్టిపెట్టానని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. అశ్వారావుపేట ప్రభుత్వ వైద్యశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన డిజిటల్ ఎక్స్‌రే యూనిట్, రక్తనిల్వ కేంద్రాలను గురువారం ఎమ్మెల్యే ప్రారంభించారు. పలువురు రక్తదానం చేయగా దానిని ఆసుపత్రిలో భద్రపరిచారు. ఎమ్మెల్యే జారే మాట్లాడుతూ పేదలు పూర్తిస్థాయిలో సర్కారు వైద్యం పొందాలనేది తన కల అని, అందుకు వేదికగా అశ్వారావుపేట ఆసుపత్రిని తయారుచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రవిబాబు, ఆసుపత్రి సూపర్నెండెంట్ రాధా రుక్మిణి, డాక్టర్ విజయ్‌కుమార్, మౌనిక, నికేశ్, ఆర్షియా, ప్రకాశ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు జూపల్లి రమేశ్, సీనియర్ నాయకులు సుంకవల్లి వీరభద్రరావు, మండల అధ్యక్షులు రాంబాబు, నాయకులు ప్రమోద్, సత్యనారాయణతో పాటు పలువురు ఉన్నారు.

బాధ్యతారాహిత్యంపై చర్యలకు ఆదేశాలు

గిరిజన ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లో విద్యార్థులకు అందించే ఆహారం విషయంలో బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన సిబ్బందిపై చర్యలకు ఆదేశాలు ఇచ్చామని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. అశ్వారావుపేటలో గురువారం ఎమ్మెల్యే జారే ఆదినారాయణ విలేకర్లతో మాట్లాడారు. బుధవారం రాత్రి అంకంపాలెం గిరిజన జూనియర్ కళాశాలకు వెళితే విద్యార్థులకు అందించే ఆహారం, బోధనలోనూ అనేక లోపాలు ఉన్నాయని, తన పరిశీలనలో తేలిన అంశాలపై తగిన చర్యలకు సంబందిత అధికారులకు ఆదేశాలు ఇచ్చానని తెలిపారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

దమ్మపేట,(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ విద్యుత్ అధికారులను ఆదేశించారు. అంకంపాలెం పంచాయతీ పరిదిలోని ఎర్రగుంపు గ్రామంలో నూతన విద్యుత్‌లైన్ ఏర్పాటుకు గురువారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఏడీఏ వెంకటేశ్వర్లు, ఏఈ సాయికిరణ్, సబ్‌ఇంజనీర్ వెంకట్, నాయకులు పాల్గొన్నారు. ప్రీప్రైమరీ పీఎం శ్రీవిద్య బోధనా బాధ్యతను అంగన్‌వాడి టీచర్స్ హెల్పర్స్‌కు ఇవ్వాలని కోరుతూ గండుగులపల్లిలో క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే జారేను కలిసి సీఐటీయూ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు.

సబ్బండ వర్గాలను మోసం చేస్తున్న కాంగ్రెస్: రేగా

భద్రాచలం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): అబద్దపు హామీలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చి సబ్బండ వర్గాలను మోసం చేస్తున్న కాంగ్రెస్ సర్కార్ ము క్కు నేలకు రాసి క్షమాపణలు అడగాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు అన్నారు. భద్రాచలంలో గురువా రం ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారంటీల పేరుతో 120 హామీలు ఇచ్చి ఒక్కటి కూడా రేవంత్ ప్రభుత్వం సవ్యంగా అమలు చేయలేదని ఎద్దేవా చేశారు. తాలిపేరు ఎడమ కాలువకు గండి పడి ఆఖరి ఆయకట్టుకు నీరు చే రటం లేదని పంటలకు నీరు ఇచ్చే దిక్కు కాం గ్రెస్ ప్రభుత్వంలో లేదన్నారు. భద్రాచలం నుంచి వెంకటాపురం వర కు ఇసుక లారీల వలన రహదారులు ధ్వంసం అయితే ఎమ్మెల్యే పట్టించుకోవటం లేదని విమర్శించారు. భద్రాచలం పట్టణానికి పరిమితమైతే నియోజకవర్గ సమస్యలు ఎలా కనబడతాయని ప్రశ్నించారు.

కరకట్ట రిటైనింగ్ వాల్ కూలిపోతే పట్టించుకునే దిక్కు లేదని విమర్శించారు. తెలంగాణకు బీఆర్‌ఎస్‌తోనే శ్రీరామ రక్ష అని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు రావులపల్లి రాం ప్రసాద్, మానే రామకృష్ణ, ఆకోజు సునీల్‌కుమార్, రేపాక పూర్ణచం ద్రరావు, కొల్లం ప్రేమ్‌కుమార్, సీతామహాలక్ష్మి, ఇమంది నాగేశ్వరరావు, యువరాజ్ పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనే ధ్యేయం: ఎమ్మెల్యే పాయం



బంజరు వంతెనను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాయం

అశ్వాపురం/బూర్గంపాడు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ప్రజలకు మౌలికసదుపాయాలు కల్పించటమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మండల పరిధిలోని గొల్లగూడెం-సర్వాయ్‌పాడు బంజరు గ్రామాల మధ్య రూ.కోటి నలభైలక్షల వ్యయంతో నిర్మించిన హైలెవల్ వంతెన, అప్రోచ్ రహదారులను ఆయన ప్రారంభించారు. అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

బూర్గంపాడు,(ఆంధ్రజ్యోతి): బూర్గంపాడు మండల పరిదిలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు గురువారం విస్తృతంగా పర్యటించారు. పర్యటనలో భాగంగా మోరంపల్లిబంజర, నకిరిపేట గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలలలో ఐటీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బాలికలకు సైకిళ్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని సైకిళ్ల అందజేశారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

వాహనాలకు అన్ని ధృవపత్రాలు ఉండాలి

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఆగస్టు14(ఆంధ్ర జ్యోతి):వాహ న దారులకు గడువు తేదీ కలిగి ఉన్న అన్ని ధృవపత్రాలు తమ వెంట ఉంచుకోవాలని జిల్లా రవాణా అధికారి వెంకటరమణ సూచించారు. గురువారం కొత్తగూడెంలో వన్‌టౌన్ సీఐ కరుణాకర్‌తో కలిసి పోస్టాఫీస్ సెంటర్‌లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వాహనదారుల ధృవపత్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వన్‌టౌన్ ఎస్ఐ విజయ, పోలీస్ రవాణా శాఖ సిబ్బందిపాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించాలి

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెరుగైన సేవలు అందించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ జయలక్ష్మీ సిబ్బందికి సూచించారు. గురువారం రామవరంలోని పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. నాన్- కమ్యూనికబుల్ డిసిజెస్ (ఎన్‌ఈడీ) లతో బాధపడుతున్న రోగులతో డీఎంహెచ్‌వో మాట్లాడారు.

అయోధ్య ఆశయ సాధనకు కృషి: సీపీఐ

పాల్వంచ టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): దివంగత సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అయోధ్య ఆశయాల సాధనకు పునరంకితమవుదామని సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. అయోధ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు వీసంశెట్టి పూర్ణ, ముత్యాల విశ్వనాథం, వెంకటేశ్వర్లు, నరాటి ప్రసాద్, పుల్లారెడ్డి, లక్ష్మికుమారి, సలీం, శ్రీనివాసరావు, ఎల్లయ్య, సలిగంటి శ్రీనివాసరావు, నరేంద్ర కుమార్, వెంకటేశ్వర్లు, శంకర్, సాయిబాబు, జమలయ్య, దస్రు, వీరస్వామి పాల్గొన్నారు.

ఇసుక లారీలను అడ్డుకున్న గ్రామస్థులు

దుమ్ముగూడెం ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి చెరుపల్లి ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిపై ఇసుక లారీలను స్థానిక ఆదివాసీ యువత గురువారం అడ్డుకున్నారు. దీంతో చెరుపల్లి నుంచి రామచంద్రునిపేట వరకు కిలోమీటర్ల పరిదిలో లారీలు నిలిచిపోయాయి. ఇసుక లారీలతో రహదారులు ధ్వంసమౌతున్నాయంటూ ఆందోళనకు దిగారు.

19న ఇసుక వేలంపాట

దుమ్ముగూడెం ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): దుమ్ముగూడెం గ్రామంలో సీజ్ చేసిన ఇసుక నిల్వలకు ఈనెల 19న బహిరంగవేలంపాటను నిర్వహిస్తామని తహసీల్దార్ గురువారం తెలిపారు. ఆసక్తి ఉన్నవారు సుమారు నలభై ట్రాక్టర్ల ఇసుక నిల్వను పరిశీలించుకొని వేలం పాటలో పాల్గొనవచ్చన్నారు. షెడ్యూల్ తెగలకు చెందిన వారు మాత్రమే వేలంలో పాల్గొనే అవకాశం ఉందన్నారు.